క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా మంగళవారం యమ్నంపేట్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ కుమార్ తెలిపారు. యమ్నంపేట్, తిరుమల ఎన్‌క్లేవ్, శ్రీరామకాలనీ, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, విహారి హోమ్స్, ఎంఎల్‌ఆర్ కాలనీ, వసంత వ్యాలీ, నవదుర్గనగర్, హెవెన్ కాలనీ, నారాయణాద్రి, శ్రీనివాస కాలనీలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన


కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించిన చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కౌన్సిలర్ బద్దం మమత జగన్మోహన్‌రెడ్డితో కలిసి చైర్మన్ కొండల్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ ఆకిటి బాల్‌రెడ్డి, నాయకులు ఆముదాల మహేష్, జైపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, కద్రేష్ చారి, సత్యనారాయణ, సంపత్, శ్రీరాములు గౌడ్, స్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బంగారు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మేడ్చల్: మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ వేడుకలో పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శైలజహరినాథ్, గౌడవెల్లి సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఆర్థిక సాయం అందజేత



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త తాటికొండ నర్సింగ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు నర్సింగ్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి రూ.80వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఎలిజాల నాగేష్‌గౌడ్, కోఆప్షన్ సభ్యుడు క్యాసారం అశోక్‌గౌడ్, నాయకులు గండి అంజయ్యగౌడ్, మచ్చ శ్రీనివాస్‌గౌడ్, వరకాల పెంటయ్యగౌడ్, విజయ్ భాస్కర్, శ్రీశైలం, శంకర్‌రెడ్డి, సురేందర్, మహేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

'గ్రామాలాభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు కేటాయిస్తోంది'



ఘట్‌కేసర్: గ్రామాలాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మర్పల్లిగూడలో కేంద్రం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ మంగమ్మ, ఉప సర్పంచ్ నరేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు లత, సుగుణ, సాయికుమార్, మంజుల, ఆనంద్, రవి, నాయకులు సాయిలు, ప్రవీణ్‌రెడ్డి, వెంకటేష్, యాదయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు ఎనలేనివి

ఘట్‌కేసర్: బాలింతలు, గర్భిణుల ఆరోగ్యం రక్షణలో అంగన్‌వాడీ టీచర్లు సేవలు ఎనలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని డ్వాక్రా భవనంలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో స్థానిక కౌన్సిలర్ నస్రీన్‌సుల్తానాతో కలిసి కేక్ చేసి అంగన్‌వాడీ టీచర్ల ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుచిత్ర, మంగ, ఉషారాణి, విజయలక్ష్మీ, రేణుక, పద్మ, తులసి, కల్పన, పున్నమ్మ, శారద, సునీత, పుష్ప, నాయకుడు రహీం, శానిటేషన్ ఇన్‌చార్జ్ యోగేశ్ పాల్గొన్నారు.


అంగన్‌వాడీ టీచర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 6,536 మందిలో 5,460 ఓటింగ్


ఘట్‌కేసర్‌లో ఓటర్లకు సహకరిస్తున్న అభ్యర్థి సహచరులు

- జిల్లా వ్యాప్తంగా ఓటింగ్ శాతం 83.54
- ఓటు వినియోగించుకోని వారు 1076 మంది

సాక్షి,మేడ్చల్ జిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగాయి. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగిన ఓటింగ్‌లో జిల్లా వ్యాప్తంగా 83.54 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 6,536 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, ఎన్నికల సమయం ముగిసేటప్పటికి 5,460 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 2,905 మంది కాగా, పురుషులు 2,555 మంది ఉన్నారు. జిల్లా పరిధిలోని కీసర ఆర్డీఓ పరిధిలో 8, మల్కాజిగిరి ఆర్డీఓ పరిధిలో 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయటంతో పాటు అన్ని వసతులు కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లోని వెబ్‌క్యాస్టింగ్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారులు పరిశీలించారు. ఓటింగ్ సరళిని కలెక్టర్ అమయ్‌కుమార్ ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకున్నారు. మైక్రో అబ్జర్వర్లు, పోలీసులు ఓటింగ్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల చర్యలతో పాటు బందోబస్తు నిర్వహించారు.

ఘట్‌కేసర్‌లో 84.8 శాతం

ఘట్‌కేసర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం పట్టణంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 95వ పోలింగ్ కేంద్రంలో 479 ఓటర్లు ఉండగా 440 ఓట్లు, 95ఏ కేంద్రంలో 588 ఓటర్లు ఉండగా 465 మంది ఓటర్లు ఓటేశారు. రెండు కేంద్రాల్లో కలిసి మొత్తం 1067 మంది ఓటర్లు ఉండగా.. 905 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో మొత్తం 84.8 శాతం ఓటింగ్ నమోదైంది. మల్కాజ్‌గిరి డీసీపీ జానకి పోలింగ్‌ను పర్యవేక్షించగా సీఐ అశోక్‌రెడ్డి పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఓటు వేసేందుకు కీసరలోని పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఉపాధ్యాయ ఓటర్లు

మేడ్చల్ పట్టణంలో 86 శాతం..

మేడ్చల్: మేడ్చల్‌లో నిర్వహించిన రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 86 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ సరిత తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయగా ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 237 మంది టీచర్లకు ఓటు హక్కు ఉండగా 204 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 102 మంది మహిళలు, 102 మంది పురుష టీచర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని తహసీల్దార్ సరిత తెలిపారు.

శామీర్‌పేటలో 83.8 శాతం..

శామీర్‌పేట్: సోమవారం జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉమ్మడి శామీర్‌పేట మండలంలో ప్రశాంతంగా ముగిసాయి. శామీర్‌పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్ 97లో 149 మందికి గాను 125 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 83.8 శాతం ఓటింగ్ నమోదైంది. ఇందులో పురుషులు 60, మహిళలు 65 మంది ఉన్నారని అధికారి స్వామి తెలిపారు.



కీసరలో 87.6 శాతం...

కీసర: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా కీసర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 96 పరిధిలో మొత్తం 339 మంది ఉపాధ్యాయ ఓటర్లుండగా అందులో 297 మంది (87.6 శాతం) ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసే వరకు పోలీసుల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



వైభవంగా మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలు


కీసరదాయరలో మల్లన్న స్వామిని దర్శించుకున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి


కీసరలో మల్లన్నస్వామిని దర్శించుకున్న తీన్మార్ మల్లన్న తదితరులు

కీసర: మండల కేంద్రమైన కీసరతో పాటు కీసర దాయర గ్రామాల్లో సోమవారం మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. శ్రీ భ్రమరామంబ కేతమ్మ, మల్లికార్జున స్వామివార్ల కల్యాణోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కీసరదాయర మల్లికార్జున స్వామిని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం కీసర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత రామిడి విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇదిలా ఉండగా కీసర గ్రామంలో మల్లికార్జున స్వామిని తీన్మార్ మల్లన్న దర్శించుకున్నారు. అనంతరం తన సొంత ఖర్చులతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వేడుకల్లో సర్పంచ్ మాదురి వెంకటేష్, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నేతలు గుర్రం మల్లారెడ్డి, గండు బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్ రోడ్డులో...

మేడ్చల్: పట్టణంలోని కిష్టాపూర్ రోడ్డులో గల మల్లన్న ఆలయంలో మల్లికార్జున స్వామి, కేతమ్మల కల్యాణోత్సవంను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గొల్లకేతమ్మ భ్రమరాంభ దేవి సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంను యాదవ సంప్రదాయబద్ధంగా నిర్వహించి సాయంత్రం బోనాలను సమర్పించారు. వేడుకలో కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోంది'


మహాసభలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జవహర్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ శ్రీనివాస్ ఆరోపించారు. (ఇఫ్టూ) మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల 2వ మహా సభలు సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ ఎల్లన్ననగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా తీసుకువచ్చి కార్పొరేట్లకు పట్టం కడుతోందని, యూనియన్ పెట్టుకునే హక్కును నిరాకరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఇఫ్టూ నగర అధ్యక్షుడు జి.అనురాధ, కార్యదర్శి శివబాబు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

మహాసభలో ఇఫ్టూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.అనురాధ, ఉపాధ్యక్షులుగా కె.స్వామి, పద్మ, ప్రధాన కార్యదర్శి శివబాబు, సహాయ కార్యదర్శిగా పి.రామ్‌రెడ్డి, శ్రీశైలం, కోశాధికారిగా ఎస్.రాములు, సభ్యులుగా యాదయ్య, ఏడీ రాము, ఇంద్రసేనారెడ్డి, స్వామి, వేణు, వజ్రమణి, రియాజ్, దేవమ్మలను ఎన్నుకున్నారు.

వైద్యులు పనితీరును మెరుగుపరుచుకోవాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సాక్షి,మేడ్చల్ జిల్లా: బస్తీ దవాఖానాల్లో వైద్యాధికారులు, వైద్యులు పనితీరును మరింతగా మెరుగుపరుచుకుని మంచి పేరు తెచ్చుకునేలా ప్రజలకు వైద్య సేవలు అందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ కోరారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సోమవారం జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానా వైద్యులతో ఆయన జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని డయాగ్నోస్టిక్స్ సెంటర్ల సేవలు, టెలీ కాన్సులేషన్, అవుట్ పేషెంట్ మాడ్యూల్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల అందజేత వంటి విషయాలను డీఎంహెచ్‌ఓ అడిగి తెలుసుకున్నారు. కొత్త వైరస్‌లు, అంటువ్యాధులు ప్రబల కుండా వైద్యాధికారులు అహర్నిశలు కష్టపడుతున్నారని కొనియాడారు. కోవిడ్ నేపథ్యంలో ప్రజలు తమవంతు బాధ్యతగా వ్యాక్సిన్ వేయించుకోవడంతో పాటు సామాజిక దూరం పాటించి, తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు. క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవాలని, శానిటైజర్లు వాడటం మరిచిపోవద్దన్నారు. సీఆర్‌పీలో శిక్షణ పొందేందుకు వైద్య సిబ్బందిని గుర్తించడంతో పాటు కార్యాచరణ ప్రణాళిక, శిక్షణా షెడ్యూల్‌ను ఖరారు చేయాలని సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి మాస్టర్ ట్రైనర్‌కు సంబంధించి ఒక్కో బ్యాచ్‌కి 20 చొప్పున 3 బ్యాచుల్లో నిత్యం 60 మంది వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, దీనికి ప్రోగ్రామ్ ఆఫీసర్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ టీమ్‌కు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలని, ప్రతీ ఆరోగ్య కేంద్రం వద్ద యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అండ్ యాంటీ స్నేక్ వెనమ్ స్టాక్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రజారోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ హెచ్చరించారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలి


సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

- పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నేత శ్రీనివాస్
- కార్మికులతో కలెక్టరేట్ ఎదుట ధర్నా

సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, వెంటనే వారి వేతనాలు చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం.. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు పంచాయతీ కార్మికులకు ఇవ్వాలని, కార్మికులకు మల్టిపుల్ వర్క్ విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర కార్మిక మంత్రిగా ఉన్న జిల్లా మంత్రి మల్లారెడ్డి గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోయినా పట్టించుకోకపోవడం దారుణమని, కార్మికుల సమస్యలపై మంత్రి వెంటనే స్పందించాలన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకులు రవి, మల్లయ్య, సుధాకర్, లక్ష్మమ్మ, పద్మ, శ్రీను యాదయ్య, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోంది


మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో మేయర్ కావ్య

జవహర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య అన్నారు. మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఫైరింగ్ కట్ట వద్ద గల జెడ్పీహెచ్ స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ హాజరై మహిళలకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణి, బింగి లావణ్య, కోఆప్షన్ సభ్యులు శోభ, బీఆర్‌ఎస్ మహిళా నాయకురాళ్లు స్వప్న, మంజుల, సంస్థ ప్రతినిధులు, పాఠశాల మహిళా ఉపాధ్యాయురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు


మానస ఓల్డేజ్ హోమ్‌లో...


బాషపల్లి రమేష్‌చారి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేస్తూ...

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మానస ఓల్డేజ్ హోమ్‌లో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకల్లో భారత జాగృతి రాష్ట్ర నాయకులు పబ్బోజు విజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేయడంతో పాటు వృద్ధులకు బ్రెడ్లు, పండ్లు, తదితరాలను పంపిణీ చేశారు. వంటేరు మధుసుధన్‌రెడ్డి, వంగాల కృష్ణారెడ్డి, ఎండీ కాశీం,ఓల్డేజ్ హోమ్ నిర్వాహకురాలు బెత్లెహెం, విజయ, అనిల్, మధు, సుమ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ్ వృద్ధాశ్రమంలో...

జవహర్‌నగర్: మేడ్చల్ నియోజకవర్గ జాగృతి కన్వీనర్ బాషపల్లి రమేష్‌చారి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఈగ సంతోష్ ముదిరాజ్ హాజరై జవహర్‌నగర్‌లోని ఆదర్శ్ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మేక లలితయాదవ్, ఆలూరి సంగీత, బీఆర్‌ఎస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, అభిలాష్, రాజుగౌడ్, వృద్ధాశ్రమం ఫౌండర్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం 'భరోసా పార్టీ'తోనే సాధ్యం

ఘట్‌కేసర్: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడం భరోసా పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ అధ్యక్షుడు ఏసయ్య అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. పేదలకు కష్టాలు రాకుండా చూడటం, మంచితనం, మానవత్వం వంటి ఆలోచనల నుంచి పుట్టిందే భరోసా పార్టీ అని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరు, ఎప్పుడు అనారోగ్యం బారిన పడుతున్నారో తెలియడంలేదని, సత్వర వైద్యం అందక లక్షలాది మంది పేదలు మరణిస్తున్నారన్నారు. వైద్యం భారం భరించలేక పేదలు అప్పుల పాలవుతున్నారని, మరి కొందరు మృతి చెందుతున్నారని ఏసయ్య అన్నారు.

కంటి వెలుగు ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రజిత

మేడ్చల్‌రూరల్: మండలంలోని మునీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం మేడ్చల్ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి గ్రామ సర్పంచ్ గణేశ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రఘు, ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు, వార్డు సభ్యులు నరేందర్, వాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేశ్‌గౌడ్ సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రవిందర్‌గౌడ్, శ్రీధర్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన సదస్సులో మల్లికార్జున్, సత్తిరాజు

ఘట్‌కేసర్: నూతన విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఏయూ హెచ్‌ఓడీ మల్లికార్జున్, ప్రముఖ ఉపన్యాసకులు తనిష్క్, సత్తిరాజు అన్నారు. విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన స్నాప్ చాట్, డీఏట, ఐఎస్‌టీఈ అనుసంధానంతో 'కృత్రిమ విభాగం అనుబంధ వాస్తవికత'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలు సాధించడానికి, మేధస్సు పెంచుకోవడానికి ఇటువంటి సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో మాధవి, చైతన్య, వంశీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

- 133 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం
- విద్యాశాఖ మంత్రితో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్‌కుమార్
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థుల కోసం కంట్రోల్ రూమ్ (040-27118584) ఏర్పాటు



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఇంటర్మీడియట్ పరీక్షలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించేందుకు పక్కాగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు 133 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయటంతో పాటు నిరంతరంగా విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, ఫర్నీచర్ వంటి అన్నీ వసతులను కల్పించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేయటంతో పాటు జిరాక్స్ సెంటర్లు మూసివేస్తామన్నారు. పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, ఇందు కోసం ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్లను నియమించినట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో జనరల్ 62,342 మంది విద్యార్థులు, ఒకేషనల్ కోర్సులో 1,452 మంది విద్యార్థులతో కలిపి మొత్తంగా 63,794 మంది పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్లో 54,146 మంది, ఒకేషన్ కోర్సులో 995 విద్యార్థులతో కలిపి మొత్తంగా 55,141 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు 1,18,935 మంది ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో ముందస్తుగా సమావేశాలు నిర్వహించామని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోలేని విద్యార్థులు నేరుగా ఇంటర్మీడియట్ వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం జిల్లా స్థాయిలో కంట్రోల్ రూం (040-27118584) ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కిషన్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఇంటర్ విద్యార్థుల కోసం రాష్ట్ర స్థాయిలో కంట్రోల్ రూమ్ (నంబర్: 040-24601010) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే, టెలీమానస్ నంబర్ 14416 ద్వారా ఉచిత కౌన్సెలింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆమె ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో మంత్రితో పాటు విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ తదితరులు ఉన్నారు.